సాక్షి పల్నాడు

ఆదివారం । 16 । ఫిబ్రవరి । 2025



రెండు ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

వేటపాలెం: అనుమతులు లేకుండా పందిళ్లపల్లి వైపు నుంచి బైపాస్ మీదుగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను స్టేషన్‌కి తరలించినట్లు ఎస్సై వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 539.70 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 9,500 క్యూసెక్కులు విడుదలవుతోంది.

అభయాంజనేయ స్వామి వార్షిక మహోత్సవం



చాగంటివారిపాలెం (ముప్పాళ్ళ): సత్తెనపల్లి-నరసరావుపేట ప్రధాన రహదారిపై చాగంటివారి పాలెం గ్రామం వద్ద ఉన్న అభయాంజనేయస్వామి 6వ వార్షిక మహోత్సవం శనివారం ఘనంగా జరిగింది.

మహా శివరాత్రికి భద్రత పెంచండి



నరసరావుపేట: మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు



అమరావతి: సమావేశంలో తహసీల్దార్ డానియేల్ తదితరులు

జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు

నరసరావుపేట: ఈ నెల 26న మహా శివరాత్రి సందర్భంగా జిల్లాలోని కోటప్పకొండ, అమరావతి, సత్రశాల, దైద శివాలయాల వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశించారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో అధికారులతో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. తిరునాళ్ల బందోబస్తు ఏర్పాట్లు, నేరాల కట్టడికి తీసుకోవలసిన చర్యల గురించి సమీక్షించారు. ఎస్పీ మాట్లాడుతూ కేసుల దర్యాప్తు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. మహిళలు, బాలికలు, చిన్నారులకు సంబంధించిన ఫిర్యాదులు అందిన వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. వారికి సంబంధించిన కేసుల విచారణ సమయంలో తప్పనిసరిగా మహిళా పోలీస్ అధికారి, సిబ్బంది ఉండేలా చూడాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండే సదస్సులు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. వేగ నియంత్రికలు, ట్రాఫిక్ సూచనలను తెలిపే సైన్ బోర్డులను, అవసరమైన చోట స్టాఫ్ బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. 112కు వచ్చే కాల్స్‌కు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. గంజాయి రవాణా అరికట్టాలని చెప్పారు. అడ్మిన్ అదనపు ఎస్పీ జేవీ సంతోష్, నరసరావుపేట, సత్తెనపల్లి, గురజాల డీఎస్పీలు కె.నాగేశ్వరరావు, ఎం.హనుమంతరావు, జగదీష్, మహిళా స్టేషన్ డీఎస్పీ వెంకట రమణ, ఏసీబీ సీఐలు సురేష్‌బాబు, శరత్‌బాబు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు

అమరావతి: అమరావతిలో వేంచేసియున్న శ్రీబాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి వారి మహా శివరాత్రి ఉత్సవాల నిర్వహణ కోసం అన్ని శాఖల అధికారులు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని తహసీల్దార్ డానియేల్ అన్నారు. శనివారం స్థానిక ఆలయంలో సమన్వయ కమిటీ రెండో సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్నానాల ఘాట్‌ల వద్ద పూర్తిస్థాయి ఏర్పాట్లు చేయాలని తెలిపారు. పోలీసులు తగినంత మంది సిబ్బందిని నియమించాలన్నారు. నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని అధికారులకు సూచించారు. అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. వేడుకల సమయంలో మద్యం షాపులను మూసివేయాలని ఎక్సైజ్ శాఖాధికారులను ఆదేశించారు. సమన్వయంతో భక్తులకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. సీఐ అచ్చియ్య, ఆలయ ఈవో సునీల్‌కుమార్, అధికారులు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉపకార పరీక్షల్లో 19 మందికి అర్హత

శావల్యాపురం: కేంద్ర ప్రభుత్వ సారథ్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి ఏడాది నిర్వహించే జాతీయ ప్రతిభ ఉపకార పరీక్షల్లో ఫలితాల్లో 19 మంది శావల్యాపురం విద్యార్థులు అర్హత పొంది పల్నాడు జిల్లాస్థాయిలో ప్రథమస్థానం సాధించారు. గత ఏడాది డిసెంబరులో జరిగిన ప్రతిభ పరీక్షల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హత పొందారు. ఒక్కో విద్యార్థికి సంవత్సరానికి రూ. 12 వేలు చొప్పున విద్యార్థి బ్యాంకు ఖాతాలోకి ప్రభుత్వం నగదు జమ చేయనుంది. ఈ సందర్భంగా శనివారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల్లో ఎంపికైన విద్యార్థులకు అభినందన కార్యక్రమం ఉపాధ్యాయులు నిర్వహించారు. విద్యాకమిటీ ఛైర్మన్ పాటిబండ్ల శ్రావణ్‌కుమార్, ప్రధానోపాధ్యాయురాలు బోడ్డపాటి విజయలక్ష్మి, ఉపాధ్యాయులు కుమ్మరి శ్రీనివాస రాజు, రాగుల రాధాకృష్ణమూర్తి, సురేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రను విజయవంతం చేయండి




కలెక్టరేట్‌లోని పరిసరాలను శుభ్రం చేస్తున్న కలెక్టర్, జేసీ, అధికారులు

నరసరావుపేట: స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు పిలుపు ఇచ్చారు. శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించాక, పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మంచి ఉద్దేశంతో అధికారులను, సిబ్బందిని, ప్రజలను భాగస్వాములను చేస్తూ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఇదే స్ఫూర్తితో కార్యాలయాలు, ఆఫీసుల్లో పెండింగ్ ఫైల్స్ పరిష్కారం అయ్యేలా చూడాలని కోరారు. తద్వారా ప్రజలకు సత్వర సేవలు అందుతాయని అన్నారు. ప్రతి మూడో శనివారం తప్పనిసరిగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని కోరారు. తడి, పొడి చెత్త సేకరణ కార్యక్రమాన్ని సమర్థంగా నిర్వహించాలని ఆదేశించారు. దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే, జిల్లా రెవెన్యూ అధికారి ఏకా మురళి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీ జెన్‌కో ఆధ్వర్యంలో..

విజయపురిసౌత్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమాన్ని నాగార్జునసాగర్ ఏపీ జెన్‌కో ఆధ్వర్యంలో విజయపురిసౌత్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. జెన్‌కో ఈఈ అప్పాజీ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. స్వచ్ఛత పాటిస్తేనే ఆరోగ్యంగా ఉంటామన్నారు. ముందుగా ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఏపీ జెన్‌కో క్వార్టర్స్ వద్ద రోడ్లను ఊడ్చి శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈఈలు రాజారెడ్డి, అక్బర్, రమణారావు, ఏఈలు గౌతమ్, శ్రీను, శ్రీనివాస్, రేవతి, సల్మా, రాణిబాయి, మనోహరమ్మ, రాణి, ఎస్పీఎఫ్ ఏఎస్ఐ సత్యమూర్తి, డాక్టర్ రేవంత్, ఉద్యోగులు చందు, రామకృష్ణ, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న జెన్‌కో ఈఈ అప్పాజీ

ప్రతి రైతుకు 11 అంకెల విశిష్ట సంఖ్య



కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి

నరసరావుపేట: కేంద్ర ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి జిల్లాలోని రైతులు అందరూ రైతు సేవా కేంద్రాల ద్వారా 11 అంకెలు గల విశిష్ట సంఖ్యను పొందాలని జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి పేర్కొన్నారు. శనివారం జిల్లాలో పలు చోట్ల కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. జిల్లా వ్యాప్తంగా పీఎం కిసాన్ పథకాన్ని పొందే రైతులు 2.09 లక్షల మంది ఉన్నారన్నారు. ఇప్పటి వరకు 35వేల మందికి విశిష్ట సంఖ్యను నమోదు చేయటం జరిగిందన్నారు. ఈనెలాఖరు నాటికి 40శాతం వరకు పూర్తి చేయాలనే లక్ష్యంతో పని చేస్తున్నామన్నారు. పథకాలను పొందేందుకు భవిష్యత్‌లో ఈ విశిష్ట సంఖ్య ఆధారంగానే సులభ సాధ్యమౌతుందన్నారు. ఈ సంఖ్యను పొందేందుకు సమీపంలోని రైతు సేవా కేంద్ర సిబ్బందికి పొలం వివరాలు, ఆధార్ లింకు అయిన సెల్‌ఫోన్ నంబరు సమర్పిస్తే ఆ రైతుకు 11అంకెలు గల విశిష్ట సంఖ్యను నమోదు చేస్తారన్నారు. సమస్య ఉత్పన్నమైతే మండల వ్యవసాయాధికారి, 83310 56905, 83310 56911 నంబర్లను సంప్రదించాలని కోరారు.

పురందేశ్వరికి ఘన స్వాగతం

సత్తెనపల్లి: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరికి సత్తెనపల్లిలో శనివారం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. ఓ ప్రైవేట్ కార్యక్రమానికి ఆమె సత్తెనపల్లి మండలం అబ్బూరు రాగా, ముందుగా పట్టణంలోని బీజేపీ కార్యాలయానికి తోడ్కొని వచ్చి సత్కరించారు.



పురందేశ్వరిని సత్కరిస్తున్న నేతలు

వరిగడ్డి వాములు దగ్ధం

గురజాల: స్థానిక ఆర్‌అండ్‌బీ బంగ్లా వద్ద వరిగడ్డి వాములు దగ్ధమైన సంఘటన శనివారం మధ్యాహ్నం జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం... బొజ్జా వెంకట నారాయణకు చెందిన వరిగడ్డి వాములు, దిబ్బలు ప్రమాదవశాత్తు తగలబడ్డాయి.

నాటికలకు సమాజమే ఇతివృత్తం



అన్నదాత నాటికలో ఓ ఘట్టం

నరసరావుపేట ఈస్ట్: నరసరావుపేట రంగస్థలి 45వ వార్షికోత్సవంలో భాగంగా రాష్ట్ర భాషా సంస్కృతిక శాఖ, రంగస్థలి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 24వ జాతీయ స్థాయి తెలుగు ఆహ్వాన నాటిక పోటీలు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. రెండవరోజు శనివారం నాటిక పోటీలను రంగస్థలి శాశ్వత సభ్యులు నాతాని సురేఖా వెంకటేశ్వర్లు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. హైదరాబాద్ కళాంజలి వారి అన్నదాత, వెలగలేరు థియేటర్ ఆర్ట్స్, వెలగలేరు వారి రాత నాటికలను ప్రదర్శించారు. రంగస్థలి అధ్యక్షుడు షేక్.మహబూబ్ సుభాని, కిలారు వెంకటరావు, ప్రధాన కార్యదర్శి నల్లపాటి రామచంద్రబోస్, కార్యనిర్వహణ కార్యదర్శి ఏ.ఏ.మధుకుమార్ తదితరులు పర్యవేక్షించారు.

అన్నదాత కడగండ్లకు కారకులెవరు?

వ్యవసాయదారుని కడగండ్లు ఇతివృత్తంగా రూపుదిద్దుకున్నది అన్నదాత నాటిక. అన్నం పెట్టే రైతు నోట్లో అందరూ మట్టి కొట్టేవాళ్లే.. ప్రకృతి వైపరీత్యాలతో పోరాడే రైతును పాలకులు, దళారులు, వ్యాపారులు అందరూ మోసం చేస్తూ రైతు జీవితాన్ని అతలాకుతలం చేస్తున్నారు. రైతు కష్టాలను కళ్లకు కట్టింది.

మన రాత మనమే రాసుకుంటాం...

మనిషికి కష్టం వస్తే నా రాతింతే అని తల పట్టుకొని కూచుంటాడు. సంతోషం కలిగితే పరిసరాలను పట్టించుకోడు. మనిషి నైజం వల్ల ప్రస్తుత సమాజంలో ఏం జరుగుతోంది.. సమాజం ఎటువైపు పోతుంది.. ప్రకృతి అనర్థాలకు కారకులెవరు వంటి ప్రశ్నలకు ప్రతి ఒక్కరే తమకు తామే సమాధానం ఇచ్చికునే పరిస్థితిని కళ్లకు కట్టినట్టుగా రాత నాటిక ప్రేక్షకులను ఆలోచింప చేసింది.

మళ్లీ విజృంభించిన వేటపాలెం ఎడ్లు

మాచవరం: మండల కేంద్రమైన మాచవరంలో లక్ష్మితిరుపతమ్మగోపయ్య స్వామి వార్ల కల్యాణోత్సవం సందర్భంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బండలాగుడు బల ప్రదర్శన పోటీల్లో భాగంగా న్యూ కేటగిరి (సేద్యం) విభాగంలో బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెం గ్రామానికి చెందిన అత్తోట శిరీషా చౌదరి శివకృష్ణ చౌదరి ఎడ్లు 3770.9 అడుగుల దూరాన్ని లాగి మొదటి స్థానంలో నిలిచాయి. వజ్రాల తేజశ్వినీరెడ్డి (సంతమాగులూరు, బాపట్ల జిల్లా) ఎడ్లు 3250 అడుగులు దూరాన్ని లాగి రెండవ స్థానంలో, సంపటం వీరబ్రహ్మం నాయుడు (క్రోసూరు, పల్నాడు జిల్లా) ఎడ్లు 3149.7 అడుగులు దూరాన్ని లాగి మూడవ స్థానంలో, తనుబొద్ది శంకర్‌రెడ్డి (ఉప్పమాగులూరు, బల్లకురవ మండలం, ప్రకాశం జిల్లా) ఎడ్లు 2798.6 దూరాన్ని లాగి నాల్గవ స్థానంలో, ముక్కపాటి హనుమంతురావు చౌదరి (మాచవరం, పల్నాడు జిల్లా) ఎడ్లు ఐదో స్థానంలో, సిద్ది మల్లేశ్వరావు (మర్రివేముల, పుల్లలచెరువు, ప్రకాశం జిల్లా) ఎడ్లు 2567.3 అడుగులు దూరాన్ని లాగి ఆరో స్థానంలో బహుమతులు అందుకున్నాయి.

రైతన్నా! శభాషన్నా!



మండల పరిధిలోని చాగంటివారిపాలెం గ్రామానికి చెందిన కొంతమంది రైతులు కోతుల బెడద నుంచి మొక్కజొన్న పంటను కాపాడుకునేందుకు వినూత్న చర్యలు చేపట్టారు. పంట కండె దశలో ఉండటంతో కోతులు పంటను కొరికి నాశనం చేస్తున్నాయి. దీంతో నిత్యం పొలంలోనే కాపలా ఉండలేక బ్యాటరీ సాయంతో ఉండే మైక్ ను పొలంలోని చెట్టుకు కట్టారు. అందులో పెద్ద పెద్దగా కేకలు వేసే మాటలను, పెద్ద పెద్ద శబ్దాలను రికార్డు చేసి ఉదయం నుంచి సాయంత్రం వరకూ మైక్‌ను ఆన్ చేసి ఉంచుతున్నారు. ఈ విధంగా పంటను కాపాడుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. కొంచెం ఆశ్చర్యమైనప్పటికీ పంటను కాపాడుకోవటంలో రైతులు చేస్తున్న చర్యలను అందరు అభినందిస్తున్నారు. - ముప్పాళ్ల